## క్లుప్తంగా

### సింగమ్మ తల్లి ఆలయం వద్ద మహాచండీ హోమం



సూర్యనారాయణపురంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: యర్నగూడెం శివారు సూర్యనారాయణపురం వద్ద కొలువైన సింగమ్మ తల్లి ఆలయంలో మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన లక్ష్మీగణపతి మహాసుదర్శన కమలాత్మికా మహాచండీ హోమం, రుద్రాభిషేకం కార్యక్రమంలో తానేటి వనిత పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఆలయ ధర్మకర్త పుట్టా బాలసుబ్రహ్మణ్యం, పుట్టా జగన్మోహనరావు, బళ్ల సత్యనారాయణ, పార్టీ నాయకులు నరహరిశెట్టి సుధాకర్, బొండాడ వెంకన్నబాబు, కేవీఆర్ మణిబాబు, కొవ్వూరు ఏఎంసీ మాజీ చైర్మన్ బండి అబ్బులు, పంచాయతీ ఉప సర్పంచ్ నరహరిశెట్టి చినబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు. కొమ్మన మణిబాబు, శ్రీవిద్య దంపతులు ఆలయం వద్ద మహాచండీ హోమం నిర్వహించారు.

### బాలదుర్గమ్మ ఆలయంలో పటిక బెల్లం తులాభారం



చిన్నారికి పటిక బెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: గ్రామంలోని బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఇద్దరు చిన్నారులకు కుటుంబ సభ్యులు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన దాసరి దుర్గా వినోద్ కుమార్, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె జస్విక, కుమారుడు జోషిత్ శ్రీరామ్‌ను అమ్మవారి ఆలయంలో వేర్వేరుగా పటిక బెల్లంతో తులాభారం వేశారు. ఆలయంలో ఇప్పటి వరకూ 678 తులాభారాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ తెలిపారు.

### ఎస్ఎంసీ తీర్మానాలు అప్‌లోడ్

నల్లజర్ల: నూతన విద్యా విధానానికి సంబంధించి స్కూల్ యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) తీర్మానాలను శుక్రవారం కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని 58 పాఠశాలల తీర్మానాలు ఇందులో ఉన్నాయన్నారు. వీటి ఆధారంగా గత ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియను మళ్లీ ఇప్పుడు మార్చనున్నారు. దీనిపై తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టి యథావిధిగా ఈ ప్రక్రియ కొనసాగించనున్నది.

### సబ్బుల వాహనం బోల్తా: ఇద్దరికి గాయాలు

నల్లజర్ల: సబ్బుల లోడుతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం అనంపల్లి శివార్లో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. జాతీయ రహదారిపై అనంతపల్లి శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన చోటు చేసుకుంది. విజయవాడ నుంచి విశాఖపట్టణం సబ్బుల పెట్టెలతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం అదుపుతప్పి ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో విజయవాడకు చెందిన టాటా ఏస్ వాహన డ్రైవర్ రామకృష్ణ, పూని సూరిబాబులకు గాయాలయ్యాయి. వీరిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ రాంబాబు తెలిపారు.

### ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

నిడదవోలు: ఎటువంటి అనుమతులు లేకుండా డిపోలోని సబ్ జూనియర్స్‌కు ఓడీ విధులు కేటాయిస్తున్నారని, సీనియారిటీ ప్రకారం ఓడీలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిడదవోలు ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఏడాది నుంచి డిపోలోని ఓడీ విధులను సీనియర్లకు కాకుండా డిపో మేనేజర్ తనకు ఇష్టం వచ్చినవారికి కేటాయిస్తున్నారని ఆరోపించారు. గ్యారేజీలో చాలాకాలంగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, మహిళలకు నెలసరి సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎంఎస్ రావు, కార్యదర్శి ఎండీ మొహిద్దున్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.అప్పారావు, వర్కింగ్ కార్యదర్శి ఎస్‌కే ముస్తఫా పాల్గొన్నారు.

### ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ

నిడదవోలు: మున్సిపాలిటీలో పన్ను బకాయిల వసూళ్లకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఏకమొత్తంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగించుకుని పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

# పట్టాలిచ్చారు.. ఇళ్లు మరిచారు

- కూటమి పాలనలో అటకెక్కిన గృహనిర్మాణ పథకం
- అనుమతుల కోసం ఏడాది నుంచి ఎదురుచూపు
- గత ప్రభుత్వంలో 8,237 మందికి పట్టాల పంపిణీ
- 4,380 మందికి ఇళ్ల మంజూరు



ఖండవల్లిలో ఖాళీగా దర్శనమిస్తున్న ఇళ్ల స్థలాలు



పెరవలిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు



పెరవలిలో పట్టాలిచ్చిన స్థలాల్లో పెరిగిన గడ్డి

పెరవలి: పేదల సొంతింటి కల సాకారం చేయాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలిచ్చి, స్థలాలు కేటాయించారు. ఇచ్చినా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాది కాలం అవుతున్నా ఒక్కరికీ కూడా ఇల్లు, స్థలం మంజూరు కాలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు, రుణం ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు గడ్డి, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కొద్ది మొత్తంలో మాత్రమే రుణం మంజూరు కావడంతో అసంపూర్తిగా గృహనిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. దీంతో అద్దె ఇళ్లల్లో ఉంటూ సొంతిలు పూర్తికాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**మండలాల వారీగా ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు**

| మండలం | స్థలాలు | ఇళ్ల మంజూరు | నిర్మించినవి |
|---|---|---|---|
| పెరవలి | 2,715 | 601 | 403 |
| ఉండ్రాజవరం | 2,610 | 2,065 | 921 |
| నిడదవోలు | 2,912 | 2,254 | 571 |
| | 8,237 | 4,380 | 1,901 |

**నిడదవోలు నియోజకవర్గంలో 8,237 మందికి పట్టాలు**

నిడదవోలు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల పథకంలో 8,237 మందికి పట్టాలు అందించారు. ఇందులో అప్పటి ప్రభుత్వం 4,380 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి నిర్మాణానికి అనుమతులు, రుణాలు మంజూరు చేశారు. అందులో చాలామంది గృహాలను నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 10 నెలలు గడుస్తున్నా ఒక్క ఇంటి నిర్మాణానికి కూడా అనుమతులు, రుణాలు మంజూరు చేయకపోవటంతో లబ్ధిదారులు స్థలం ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారినా పేదలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని పలువురు అంటున్నారు. కావాలనే ఇళ్ల నిర్మాణానికి నిధుల మంజూరును నిలుపుదల చేసారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**విరివిగా రుణాలు మంజూరు చేయాలి**

గత ప్రభుత్వంలో ఇల్లు కట్టుకోండి అంటూ అధికారులు లబ్ధిదారుల చుట్టూ తిరిగితే నేటి ప్రభుత్వంలో అధికారుల చుట్టూ లబ్ధిదారులు తిరిగినా ఫలితం లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కాలంలో ఎన్నో కొన్ని ఇళ్లు మంజూరు చేసి ఉంటే ఈ సమయానికి నిర్మాణాలు వేగంగా జరిగేవని, రాబోయే వర్షాకాలంలో ఇళ్ల నిర్మాణానికి ఆటంకాలు వస్తాయని పలువురు అంటున్నారు. కాలం గడిచే కొద్దీ గృహనిర్మాణ సామగ్రి ధరలు చుక్కలనంటుతున్నాయని, రాబోయే రోజుల్లో నిర్మాణ పనులు లబ్ధిదారులకు భారమవుతుందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం ఇసుక అందుబాటులోకి వచ్చిందని, ప్రభుత్వం స్పందించి గృహనిర్మాణదారులకు విరివిగా రుణాలు, ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో జగనన్న కాలనీల పేరుతో 8,237 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారని, గృహనిర్మాణాలు పూర్తయితే గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే అక్కసుతో రుణాలు, ఇళ్లు మంజూరు చేయడం లేదని పలువురు లబ్ధిదారులు అంటున్నారు.

**రుణం కోసం ఎదురు చూస్తున్నాం**



ఇంటి స్థలం కేటాయించారు. నేటికీ గృహనిర్మాణానికి అనుమతులు, రుణం మంజూరు చేయలేదు. ఇంటి నిర్మాణానికి అనుమతి పత్రాలు, రుణం అందించి ఉంటే ఈ పాటికి గృహ ప్రవేశం చేసేవాళ్లం. ఏడాది కాలంగా ఇల్లు నిర్మాణానికి అనుమతులు, రుణం మంజూరు కోసం ఎదురు చూస్తున్నాను.

– పులపర్తి యువ కిషోర్, లబ్ధిదారుడు అన్నవరప్పాడు

**పేదలను ఆదుకోవాలి**



ఖండవల్లిలో 530 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఒక్కరికీ కూడా నేటికీ ఇంటి నిర్మాణానికి అనుమతి పత్రాలు రుణం మంజూరు కాలేదు. పేదలను ఆదుకునేలా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. ఇళ్లు మంజూరు చేస్తే చాలా మందికి సొంతింటి కల నెరవేరేది.

– దిద్ద సంపతిరావు, ఖండవల్లి

### విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన ఉండాలి

గోపాలపురం: విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని అగ్రికల్చర్ ఒకేషనల్ ఇన్‌స్పెక్టర్ కె.అఖిల్‌బాబు అన్నారు. సమ్మర్ ఒకేషనల్ ఇంటెన్సివ్‌లో భాగంగా చిట్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయమే మన దేశానికి వెన్నెముక అని అన్నారు. విద్యార్థి దశ నుంచే వ్యవసాయ రంగంలో వివిధ రకాల పురుగు మందుల వాడకం, వాటి వలన కలిగే అనర్థాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. హెచ్ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వివాహ వేడుకకు మాజీ మంత్రి వనిత

గోపాలపురం: వాదాకుంటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఆచంట రామారావు కుమార్తె వివాహం శుక్రవారం గోపాలపురం కేఎస్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర మాజీ హోం మంత్రి, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారా యణ, కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కే వలీ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కూసం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం లేనట్టే

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసు కలెక్టర్ ప్రశాంతి తిరస్కరించినట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మీపై అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సిందిగా గత నెల 20న 17 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కలెక్టర్ పి.ప్రశాంతికి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు అవిశ్వాస తీర్మానాన్ని అందించారు. అనూహ్యంగా మారిన రాజకీయ పరిణామాలతో వైఎస్సార్ సీపీ నుంచి అవిశ్వాసం నోటీసు ఇచ్చిన 17 మంది కౌన్సిలర్లలో ముగ్గురు వెనక్కి తగ్గడంతో వైఎస్సార్ సీపీ బలం 14కు తగ్గింది. అవిశ్వాసం ప్రవేశపెట్టే కౌన్సిలర్ల సంఖ్య నిబంధనల ప్రకారం 15 మంది ఉండాలి తగినంత బలం లేకపోవడంతో అవిశ్వాసం తీర్మానాన్ని కలెక్టర్ పి. ప్రశాంతి తిరస్కరించారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



లంకమాలపల్లిలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని

పెరవలి: గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్ల వచ్చే వరకు మహిళలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని తెలిపారు. ఖండవల్లి సెక్టార్ పరిధిలో లంకమాలపల్లి గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో పోషకాలన్నీ పొందాలంటే ఆకుకూరలను ఎక్కువగా ఆహారంగా తీసుకోవాలన్నారు. మునగాకు వారానికి రెండు సార్లు పప్పుతో కలిపి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవరప్పాడు, ఖండవల్లి, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం**

నల్లజర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు మంచి పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పోతవరం సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. పోతవరం 41వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ, నిత్య ఆహారంలో కూరగాయలు, పాలు, ఆకుకూరలు ఉండాలని సూచించారు. పౌష్టికాహార లోపంతో అనేక రుగ్మతలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలో వెయ్యి రోజుల సంరక్షణ ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రసవం అయ్యే వరకూ ఉన్న కాలం 270 రోజులు, బిడ్డ పుట్టిన తర్వాత రెండేళ్ల వరకూ 730 రోజులు కలిపి వెయ్యి రోజుల ప్రణాళికతో తల్లీబిడ్డలకు సమతుల ఆహారం అందించడం పౌష్టికాహార పక్షోత్సవాల ఉద్దేశమని వివరించారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు తగదు



కొవ్వూరు ఆర్డీవో రాణి సుష్మితకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు(తాళ్లపూడి): రాష్ట్ర ప్రభుత్వం సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డితో పాటు మరో ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడం భావప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయని ఏపీయూడబ్ల్యూజే అనుబంధ సంస్థ కొవ్వూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లా స్వామి నాయుడు, ఇతర పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఏపీయూడబ్ల్యూజే, కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆందోళన చేసారు. అనంతరం ఆర్డీవో రాణి సుస్మితకు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీయుడబ్ల్యూజే ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ సందర్భంలో, ఏపీయూడబ్ల్యూజే అనుబంధ సంస్థ అయిన కొవ్వూరు ప్రెస్‌క్లబ్ తరఫున, జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నల్ల స్వామినాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీరంగం సత్య ప్రసాద్, ఉపాధ్యక్షుడు-2 పుప్పాల సురేష్, కార్యదర్శి తోట అవినాష్, సహాయక కార్యదర్శి గొర్రాల ఎర్రన్న, సంయుక్త కార్యదర్శి జి.రవి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలి**

తాళ్లపూడి: పల్నాడు జిల్లాలో సాక్షి పత్రిక ఎడిటర్‌పై, ఆ సంస్థ విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని కొవ్వూరు వైఎస్సార్ సీపీ కోర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. కొవ్వూరులో శుక్రవారం తలారి వెంకట్రావు మాట్లాడుతూ సాక్షి జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలను ప్రచురిస్తున్న పత్రికలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాస్తవాలు ప్రచురించిన విలేఖరులపై కేసులు పెట్టడం అమానుషమని అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పరిపాలన జరుగుతోందని, ప్రజాస్వామ్యంలో ప్రధానమైన మీడియాపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం సరికాదని ఆయన అన్నారు.

# సందడిగా అ'పూర్వ' సమ్మేళనం



చివటం కాకతీయ కల్యాణ మండపంలో కలిసిన 1981బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

ఉండ్రాజవరం: దువ్వ ఉన్నత పాఠశాలలో 44 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా శుక్రవారం కలుసుకుని సందడి చేశారు. వారంతా 1981లో పదో తరగతి పూర్తి చేసారు. ఉన్నత చదువులకు, వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల నిమిత్తం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి స్థిరపడ్డారు. వారంతా మండలంలోని చివటం గ్రామంలోని కాకతీయ కల్యాణ మండపంలో కలిశారు. ఒకరికొకరు తమ బాల్య స్నేహితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని, బాల్య స్నేహితులతో ముచ్చట్లతో కాలం గడిపి ఆనందంలో మునిగి తేలారు. ఈ సందర్భంగా ఆనాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కుటుంబ సమేతంగా వారంతా హాజరై అప్యాయంగా పలకరించుకుని విందు వినోదాలతో సంతోషంగా రోజంతా గడిపారు. ఈ కలయిక మరువలేని అనుభూతిని మిగిల్చిందని వారంతా పేర్కొన్నారు.

### చిన సుగంధి చెరువును ఉపాధి హామీలో అభివృద్ధి చేస్తాం

తాళ్లపూడి: చిన సుగంధి చెరువును ఉపాధి హామీ పనుల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రమాదేవి తెలిపారు. పెద్దేవంలోని చినసుగంధి చెరువును అభివృద్ధి చేయాలని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు అధికారులకు విన్నవించడంతో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రమాదేవి, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తోట రామకృష్ణ తదితరులు చెరువును శుభ్రం చేయడంతోపాటు, ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీవో రమాదేవి మాట్లాడుతూ చెరువులో ఉన్న నీటిని తొలగించిన తరువాతే అంచనాలు వేయటానికి వీలవుతుందని, నీరు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



కోరుమామిడిలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డ్వామా అధికారులు

నిడదవోలు రూరల్: మండుటెండలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందించక పోవడంతో ఈనెల 8న 'సాక్షి'లో నీడ కరువు – బతుకు బరువు' శీర్షికన ప్రచురించిన కథనానికి డ్వామా అధికారులు స్పందించారు. డ్వామా జిల్లా పీడీ ఎ.నాగమహేశ్వరరావు ఆదేశాలతో ఏపీఓ ఎ.సత్యనారాయణ, టీఏ పి.భాస్కర్ శుక్రవారం కోరుమామిడి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల ఇబ్బందులను తెలుసుకుని పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్ అంబటి గోపమ్మ ఆర్థిక సహాయంతో కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఇంపాక్ట్

### లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడి అరెస్టు

నల్లజర్ల: మండలంలోని ఓ గ్రామంలోని కాలనీలో విద్యార్థినీ విద్యార్థులను లైంగిక వేధింపులకు గురి చేసిన 60 సంవత్సరాల వృద్ధుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ రాంబాబు కథనం ప్రకారం, హెచ్ఐవీ రోగి అయిన అదే కాలనీకి చెందిన ఈ వృద్ధుడు అభంశుభం తెలియని విద్యార్థులతో లైంగిక అకృత్యాలకు పాల్పడ్డాడు. బాధిత విద్యార్థులు తొమ్మిది మందికి గత సోమవారం హెచ్ఐవీ పరీక్షలు చేయించామని, రిపోర్టులు రావాల్సి ఉందని సీఐ చెప్పారు.

# ఆదర్శనీయుడు జ్యోతిరావు ఫూలే



గోపాలపురంలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



కొవ్వూరులో పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు

గోపాలపురం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసని మహనీయుడు, యువతకు ఆదర్శనీయుడు దివంగత జ్యోతిరావుపూలే అని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత పూలేకు దక్కుతుందన్నారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, సాలి వేణు,పీతల ప్రసాద్‌బాబు, కాకులపాటి శ్రీనువాసు, ఎస్‌కే వల్లీ, మల్లిపూడి సలీం, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పెనుగొండ బాలాజీ పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..**

కొవ్వూరు(తాళ్లపూడి): వర్తమాన సమాజంలో పూలే ఆలోచనలకు చాలా ప్రాధాన్యత ఉందని నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. తొలి సామాజిక విప్లవ యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కొవ్వూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నాయకులు చిట్టూరి అన్నవరం, కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, అంకోలు వెంకటపద్మ లీలా, కొవ్వూరు మండలం పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, గండ్రోతు శివ శివరామకృష్ణ, మసా ఆనంద్, మెరిపే వీర్రాజు, పాక మోహన్ రావు, బోడిసింగ్ తులసి, ఎండీ వలి, నేతల వెంకటేష్, పలపాల సూర్యచంద్రం పాల్గొన్నారు. కొవ్వూరు సీఐటీయూ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం సుందర్‌బాబు, నాయకులు బీరా రవి, జట్టు కార్మిక సంఘం నాయకుడు కె కనకారావు తదితరులు పాల్గొన్నారు.

**మండల పరిషత్ కార్యాలయంలో..**

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

**పూలే సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి**

ఉండ్రాజవరం: జ్యోతిరావు పూలే సేవలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈవోపీఆర్డీ అంజనేయ శర్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పూలే ఆశయ సాధన కోసం కృషి**

నిడదవోలు: జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు రంగా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ హైస్కూలు -2లో రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్, హెచ్ఎం సత్తి శ్రీరామరెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు పి. సువర్ణరాజు, మోర్త సాయికుమార్ పాల్గొన్నారు.

- నిడదవోలు మున్సిపల్ ఉద్యోగులు -వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం )ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలేకి ఘనంగా నివాళులు అర్పించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**రాగోలపల్లి పాఠశాలలో..**

తాళ్లపూడి: బడుగు, బలహీన వర్గాలను బహుజనులుగా సంఘటితం చేసిన సామాజికవేత్త జ్యోతిరావుపూలే అని ప్రధానోపాధ్యాయుడు డి దుర్గారావు పేర్కొన్నారు. రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం సామాజిక విప్లవ మూర్తి మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా హెచ్ఎం డి దుర్గారావు ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సామాజిక సంస్కర్త పూలే**

దేవరపల్లి: కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జోతిరావు పూలే అని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. పూలే జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద పూలే చిత్రపటానికి ఎంపీపీ దుర్గారావు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ ఎం.తిరుమలదాస్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలనాధికారి శాంతి, కార్యదర్శి నిట్టా రవికిషోర్ పాల్గొన్నారు.